సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 31 । మార్చి । 2025



..సహాయక చర్యలు

ఎస్‌ఎల్‌బీసీలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



గ్రూప్‌-1లో ప్రతిభ

ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు గ్రూప్‌-1లో మెరుగైన ర్యాంకులు సాధించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /20.6

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్‌

కమణీయం.. శ్రీనివాసుడి కల్యాణం



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లాకేంద్రంలోని సింహగిరిలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణ ఘట్టాలతో ఆలయాలు, పరిసర ప్రాంతాలు పులకించిపోయాయి. స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి సంపూర్ణ కటాక్షం మహబూబ్‌నగర్‌ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది మీ అందరి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, సీహెచ్‌ కృష్ణయ్య, భాస్కర్‌, సంజీవ, మల్లేష్‌, బలరాం తదితరులు పాల్గొన్నారు.



రాచమార్గంపై చిన్నచూపు

- అభివృద్ధిని మరిచిన అధికారులు
- అధ్వానంగా నాగర్‌కర్నూల్‌– మిడ్జిల్‌– హైదరాబాద్‌ రోడ్డు
- మూడు జిల్లాలు, పది మండలాలు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో అనుసంధానం
- అనేక మలుపులతో ప్రమాదభరితం
- అభివృద్ధి చేస్తే హైవేలపై తగ్గనున్న ట్రాఫిక్‌

- వివరాలు 8లో..



మాహే రంజాన్‌..

- నేడు ఈదుల్‌ ఫితర్‌ పండుగ
- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముగిసిన రంజాన్‌ ఉపవాసాలు

- వివరాలు 9లో..

ఎత్తిపోతలు జరిగేనా?

‘పాలమూరు’ ద్వారా 4 టీఎంసీల నీటి పంపింగ్‌కు అనుమతులు



పాలమూరు ఎత్తిపోతల పథకం సర్జిపూల్‌

- పంప్‌హౌజ్‌లో కొనసాగుతున్న పనులు
- పూర్తికాని విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నిర్మాణం
- గతేడాది అక్టోబర్‌ నుంచి వాయిదా పడుతున్న వైనం
- వచ్చే నెలలో తప్పనిసరిగా చేపడతామంటున్న అధికారులు

కొల్లాపూర్‌: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి పంపింగ్‌ నెలల తరబడి వాయిదా పడుతూ వస్తోంది. ప్రాజెక్టు పంప్‌హౌజ్‌ పనులు ముమ్మరంగా జరుగుతున్నా నీటి ఎత్తిపోతలు మాత్రం నోచుకోవడం లేదు. అయితే ఏప్రిల్‌ నెలలో తప్పనిసరిగా నీటి ఎత్తిపోతలు చేపడుతామని సంబంధిత అధికారులు చెబుతుండగా ఆచరణలో అమలుకు నోచుకుంటుందా.. లేదా.. అనేది సందేహంగా మారింది.

4 టీఎంసీలకు అవకాశం..

పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఐదేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. 2023 సెప్టెంబర్‌ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఎల్లూరు సమీపంలోని మొదటి లిఫ్టును ప్రారంభించగా.. ఒక మోటారు ద్వారా రెండు టీఎంసీల నీటిని నార్లాపూర్‌ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. తాగునీటి అవసరాల కోసం ఈ సీజన్‌లో నాలుగు టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉంది. గతేడాది అక్టోబర్‌లోనే కృష్ణానది పరవళ్లు తొక్కగా.. నాటి నుంచి ఎత్తిపోతలు చేపడతామని అధికారులు చెబుతూ వస్తుండగా.. ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు.

మోటార్ల బిగింపు పూర్తి..

పాలమూరు ప్రాజెక్టులోని మొదటి లిఫ్టు అయిన ఎల్లూరు పంపుహౌజ్‌లో ఇప్పటి వరకు నాలుగు మోటార్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. మరో నాలుగు మోటార్ల బిగింపునకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. రెండు మోటార్లకు విద్యుత్‌ సరఫరా, చార్జింగ్‌ వంటి పనులన్నీ పూర్తి చేశారు. డెలివరీ మెయిన్స్‌ కూడా దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి. విద్యుత్‌ సరఫరాకు సంబంధించిన సమస్యలే ఎత్తిపోతలు పెండింగ్‌లో పడటానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రాజెక్టు వద్ద 400/11 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేస్తుండగా.. నిర్మాణం, విద్యుత్‌ సరఫరా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ప్రభుత్వం దృష్టిసారిస్తేనే..

పాలమూరు ప్రాజెక్టు పనులపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ నీటి ఎత్తిపోతలు మాత్రం జరగడం లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొదటి లిఫ్టు ద్వారా నీటి ఎత్తిపోతలు జరిగితే.. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలతోపాటు హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయి. కేఎల్‌ఐ ప్రాజెక్టుపై ప్రస్తుతం ఉన్న భారం కూడా తగ్గుతుంది.

పాలమూరు ప్రాజెక్టు పంప్‌హౌజ్‌లో ఏర్పాటుచేసే మోటార్లు	9
ఒక్కో మోటారు సామర్థ్యం	145 మెగావాట్లు
ఒక మోటారుతో రోజు ఎత్తిపోసే నీరు	3,000 క్యూసెక్కులు
నార్లాపూర్‌ రిజర్వాయర్‌ నీటినిల్వ సామర్థ్యం	6.04 టీఎంసీలు
ఈ సీజన్‌లో తాగునీటి అవసరాలకు అనుమతి ఉన్న నీటి వాటా	4 టీఎంసీలు

తుది దశకు పనులు..



ఎల్లూరు లిఫ్టు వద్ద నాలుగు మోటార్ల బిగింపు పూర్తయింది. సివిల్‌ వర్క్స్‌, డెలివరీ మెయిన్స్‌ పనులు తుది దశకు చేరాయి. అక్టోబర్‌ తర్వాత ఎత్తిపోతలు చేపట్టాలని భావించినా.. మోటార్ల బిగింపు, విద్యుత్‌ సరఫరా పనులు కొనసాగుతున్నందున సాధ్యం కాలేదు. తాగునీటి అవసరాలకు ఈ సీజన్‌లో 4 టీఎంసీలు ఎత్తిపోసుకునే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో తప్పనిసరిగా ఎత్తిపోతలు చేపడుతాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటి పారుదలశాఖ



పాలమూరు ప్రాజెక్టు అప్రోచ్‌ చానల్‌ వద్ద శ్రీశైలం బ్యాక్‌వాటర్‌

తగ్గుతున్న నీటి నిల్వలు..

శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌పై ఆధారపడి పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ ఫుల్‌గేజ్‌ లెవెల్‌ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 837 అడుగుల దిగువకు నీటిమట్టం చేరింది. డ్యాంలో నీటి నిల్వ 58 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. బ్యాక్‌వాటర్‌ డెడ్‌ స్టోరేజీ 30 టీఎంసీలు. అప్పటి వరకు ప్రాజెక్టుల ద్వారా బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం తమ వాటాకు సంబంధించిన నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో.. శ్రీశైలం డ్యాంలో ఉన్న 28 టీఎంసీల నీటిని తెలంగాణ వాడుకునేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం కేఎల్‌ఐ ద్వారా రోజూ ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ డెడ్‌ స్టోరేజీకి చేరేలోగా పాలమూరు ప్రాజెక్టుకు కేటాయించిన నీటిని ఎత్తిపోసుకోవాలని నీటి పారుదలశాఖ అధికారులు భావిస్తున్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట భద్రత: ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్‌ క్రైం: జిల్లాలో రంజాన్‌ పండగ నేపథ్యంలో ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలని పోలీస్‌ అధికారులను ఎస్పీ జానకి ఆదేశించారు. జిల్లా పోలీస్‌ అధికారులతో ఆదివారం ఎస్పీ టెలీకాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడారు. ముస్లింలు రంజాన్‌ పండగ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈద్గాలతోపాటు మసీదుల దగ్గర సైతం బందోబస్తు ఉండాలని సూచించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. జిల్లాలో పోలీసులు 24 గంటలు విధుల్లో ఉంటారని, ఎవరూ కూడా భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రత్యేక నమాజ్‌లు చేసే ఈద్గాల దగ్గర అదనపు బలగాలను బందోబస్తుకు కేటాయించినట్లు వివరించారు. ట్రాఫిక్‌ కట్టడి, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షణ, క్యూఆర్‌టీ మున్సిపల్‌, రెవెన్యూ అధికారులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని బందోబస్తు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా అత్యవసరం అయితే పోలీస్‌ కంట్రోల్‌ రూంను సంప్రదించాలని సూచించారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

స్వర్ణాభరణాలంకరణలో వేంకటేశ్వరుడు



స్వర్ణాభరణాలంకరణలో మన్యంకొండ వేంకటేశ్వర స్వామి ధగధగా మెరిసిపోతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. విశేషోత్సవాల్లో మాత్రమే స్వామివారికి స్వర్ణాభరణ అలంకరణ చేస్తుండగా.. ప్రతి ఏడాది ఉగాది పండుగ రోజు స్వామివారిని స్వర్ణాభరణ అలంకరణ చేస్తారు. శ్రీరామ నవమి వరకు స్వామివారికి ఈ అలంకరణ ఉంటుంది. దీంతో వారం రోజుల పాటు స్వామివారు స్వర్ణాభరణ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే స్వామివారిని పల్లకీలో గర్భగుడి నుంచి హనుమద్దాసుల మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో పూజలు చేసి తరించారు.

– మహబూబ్‌నగర్‌ రూరల్‌

రామలింగేశ్వరస్వామికి విశేషాలంకరణ

అడ్డాకుల మండలంలోని కందూర్‌ సమీపంలో స్వయంభూగా వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి ఆదివారం విశేషాలంకరణ చేశారు. అర్చకులు వివిధ రకాల పూలతో గర్భగుడిని, శివలింగాన్ని శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. ఉగాది పండుగ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకున్న భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. తర్వాత ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఆలయం బయట ఉన్న దుకాణాల వద్ద రద్దీ కనిపించింది.

– అడ్డాకుల



ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో మహబూబ్‌నగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలతోపాటు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలో ఏ వేడుకలైనా భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో కలిసిమెలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన 12 మందిని ఘనంగా సన్మానించారు. వీరిలో మనోహర్‌రెడ్డి (న్యాయవాది), లయన్‌ నటరాజ్‌ (రెడ్‌క్రాస్‌ సొసైటీ చైర్మన్‌), డా.శామ్యూల్‌ (వైస్‌ చైర్మన్‌), పాండురంగం (యోగా గురువు), చెన్నవీరయ్య (రిటైర్డ్‌ పీడీ), నాయిని భాగన్నగౌడ్‌ (స్వరలహరి కల్చరల్‌ అకాడమీ కార్యదర్శి), శ్రీనయ్యశెట్టి (రిటైర్డ్‌ ప్రిన్సిపాల్‌), రామచందర్‌ నాయక్‌ (రిటైర్డ్‌ పీడీ), సిర్రా నారాయణ (రిటైర్డ్‌ టీచర్‌), రఫీఅహ్మద్‌ పటేల్‌ (క్వామీ ఏక్తా కమిటీ వ్యవస్థాపకుడు), డా.మురళీధర్‌రావు (వైద్యుడు), వేణుగోపాల్‌ (జర్నలిస్టు) ఉన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఒబేదుల్లా కొత్వాల్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్‌ కె.లక్ష్మణ్‌యాదవ్‌, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ బెక్కరి అనిత, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్‌, సంజీవ్‌ ముదిరాజ్‌, సత్తూర్‌ చంద్రకుమార్‌గౌడ్‌, సిరాజ్‌ఖాద్రీ, మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ డి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు స్వర్ణసుధాకర్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి తదితరులు

చిన్నచింతకుంట: రాష్ట్ర ప్రజలందరిపై కురుమూర్తిస్వామి ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఉగాది పండగను పురస్కరించుకొని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు స్వర్ణసుధాకర్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డితో కలిసి కుటుంబ సమేతంగా కురుమూర్తిస్వామిని దర్శించుకొని.. అనంతరం ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమూర్తిస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం దిగ్విజయంగా ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, కురుమూర్తిస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్‌ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర, మదనాపురం మార్కెట్‌ కమిటీ చైర్మన్లు ప్రశాంత్‌కుమార్‌, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికీ ‘ఉపాధి’



ఉపాధి పనుల్లో భాగంగా చెరువులో పూడిక తీస్తున్న కూలీలు (ఫైల్‌)

అనుసంధానంగా పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్‌

- పండ్ల తోటల పెంపకం, పశువుల కొట్టాలు, కోళ్ల ఫారాల నిర్మాణాలు
- జిల్లావ్యాప్తంగా 280 కిలోమీటర్ల రోడ్ల ఏర్పాటుకు చర్యలు
- పూర్తిగా కూలీలతో పనులు చేపట్టాలని ఆదేశాలు
- రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదం

జెడ్పీసెంటర్‌ (మహబూబ్‌నగర్‌): గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత విస్తరించారు. తాజాగా వ్యవసాయ అనుసంధాన పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో ప్రధానంగా పంట పొలాల వద్దకు మట్టి రోడ్లు, పండ్ల తోటల పెంపకం, పశువుల కొట్టాలు, కోళ్లఫారాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో 1.35 జాబ్‌ కార్డులు ఉండగా.. 2.22 లక్షల మంది కూలీలు పనిచేస్తున్నారు. కాగా గతంలో కూలీలతో ఎక్కువగా చెరువు, కుంటల్లో మట్టి తీయించే పనులు చేపట్టేవారు. కానీ, ఈ ఏడాది నుంచి వ్యవసాయ అనుసంధాన పనులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా పలు రకాల పనులు చేపడుతున్నారు.

20 కిలోమీటర్ల మేర రోడ్లు..

జిల్లాలో 14 మండలాలు ఉండగా 423 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి మండలానికి 20 కిలోమీటర్ల మేర రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా 280 కిలోమీటర్ల వరకు పొలాలకు రోడ్లు వేయనున్నారు. పొలానికి బాట, పంట పొలాల వద్దకు రోడ్లు ఉంటే రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. ఇందులో మండలానికి 12 కిలోమీటర్ల వరకు తప్పకుండా మట్టి రోడ్లు వేయాలనే నిబంధన ఉంది. అయితే అంతకంటే ఎక్కువ అవసరం ఉన్నా బాట వేసుకునే వెసులుబాటు కల్పించారు. వీటిని పూర్తిగా కూలీలతో చేయించాలని ఆదేశించారు.

10 పశువుల కొట్టాలు..

రైతుల పొలాల్లో పశువుల కొట్టాలు కూడా నిర్మించనున్నారు. మండలానికి 10 చొప్పున జిల్లావ్యాప్తంగా 140 నిర్మించనున్నారు. దీంతోపాటు పంట పొలాల్లో నీటి గుంతలు, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ చేపడుతున్నారు. అంతేకాకుండా మండలానికి 15 ఎకరాల భూమిని లెవలింగ్‌ చేయడం కూడా ఇందులో పెట్టారు. జిల్లావ్యాప్తంగా 210 ఎకరాల్లో భూమి చదువు చేయడంతోపాటు ఇతర పనులు చేపట్టనున్నారు.

ఒక కోళ్ల ఫారం, 5 పాంపాండ్లు

మండలానికి ఒక కోళ్ల ఫారాన్ని ఈజీఎస్‌ ద్వారా మంజూరు చేశారు. దీంతో జిల్లాలోని 14 మండలాలకు గాను 14 కోళ్ల ఫారాలు నిర్మించనున్నారు. ఒక్కో ఫారంలో వెయ్యి కోళ్లను రైతులు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనికి రూ.3 లక్షలు ఖర్చు అవుతుండగా.. పూర్తిగా సబ్సిడీపైనే నిర్మించనున్నారు. అలాగే మండలానికి 5 చొప్పున పాంపాండ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో రైతులు నీళ్లు నిల్వ చేసుకుని పంట పొలాలకు వాడుకోవచ్చు.

70 ఎకరాల్లో పండ్ల తోటలు..

జిల్లాలో పండ్ల తోటలను ప్రోత్సహించేందుకు ఉపాధి హామీలో ప్రతి మండలానికి 5 ఎకరాల చొప్పున 70 ఎకరాల్లో పండ్ల సాగు చేయనున్నారు. ఎకరా మామిడి తోటకు 70 మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఒక్కో మొక్కకు రూ.30 చొప్పున, ఒక్కో గుంత తీసేందుకు రూ.228 ఇవ్వనున్నారు. అలాగే మూడేళ్లపాటు మొక్కలు రక్షించేందుకు నెలకు ఒక్కో మొక్కకు రూ.12 చొప్పున, 70 మొక్కలకు రూ.30,240 సదరు రైతు ఖాతాలో జమ చేస్తారు. అంతేకాకుండా మొక్కకు సపోర్టుగా నాటే కర్రలతోపాటు ఎరువులకు అయ్యే ఖర్చులు సైతం రైతుకు చెల్లిస్తారు. ఒక రైతు ఐదెకరాల వరకు తోటలు పెంచుకోవచ్చు. కాగా ఒక ఎకరాకు మొత్తం రూ.54,635 సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. అదేవిధంగా జామ, డ్రాగన్‌ ఫ్రూట్‌, సీతాఫల్‌, కొబ్బరి, అల్లనేరడి తదితర రకాల పండ్ల తోటలు సాగు చేయవచ్చు.

బాట లేని పొలాలకు మేలు..



ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా బాట లేని పొలాలకు బాట వేయడం సంతోషం. చాలా పొలాలకు బాటలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీలో బాట వేస్తే చాలా మంది రైతులకు మేలు జరుగుతుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. – బుహమ్మ, మహిళా రైతు, జైనల్లీపూర్‌

కొత్త పనులు చేర్చారు..



ఉపాధి హామీలో కొత్తగా పలు రకాల పనులు చేర్చారు. భూమి లెవలింగ్‌, కోళ్ల ఫారం, పాంపాండ్లు, పశువుల కొట్టాలు నిర్మించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఖర్చు పెట్టుకుని భూమిని చదును చేసుకోలేని రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. ఇందులో పేద రైతులకు చాలా ఉపయోగపడుతుంది. – వెంకట్‌నాయక్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వం ఈసారి ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుసంధాన ప నులు చేసుకునేందుకు అవకా శం కల్పించింది. పొలాలకు మట్టి రోడ్లతో పాటు పండ్ల తో టల పెంపకం, కోళ్ల ఫారాలు, పశువుల పాకలు, నీటి కుంటల నిర్మాణం చేపట్టనున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – నర్సింహులు, డీఆర్‌డీఓ

వైభవంగా పాలమూరు ఉగాది ఉత్సవాలు

- అలరించిన నృత్యాలు, పాటలు, కవితాగానాలు



మాట్లాడుతున్న డాక్టర్‌ మధుసూదన్‌రెడ్డి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ఉగాది పర్వదినం సందర్భంగా సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌ కళాభవన్‌లో ఆదివారం రాత్రి పాలమూరు ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. సాంస్కృతిక వేదిక సభ్యులతోపాటు పలువురు ప్రముఖులు తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణలతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా సుద్దాల హనుమంతు సాంస్కృతిక గౌరవాధ్యక్షుడు డాక్టర్‌ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మీయత, అనుబంధాలు ఆనందానికి కేంద్రంగా నిలుస్తాయని, ప్రస్తుత పరిశోధనలు వెల్లడిస్తున్నాయన్నారు. విదేశీ విష సంస్కృతి అధికమవుతోందని, మన సంస్కృతిలోని మాధుర్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్‌ బాద్మి శివకుమార్‌ అన్నారు. కార్యక్రమం మధ్యలో కవులు ఆలపించిన కవితలు ఆలోచనలు రేకెత్తించాయి. జానపద కళాకారులు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు గాయకులు ఆలపించిన పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ప్రదర్శనలు చేసిన ప్రతి కళాకారునికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక జిల్లా అధ్యక్షుడు బెక్కం జనార్దన్‌, వి.కురుమూర్తి, కార్యవర్గ సభ్యులు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌ కళాభవన్‌లో జరిగిన ఉగాది ఉత్సవాల్లో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

కొడుకు మరణం తట్టుకోలేక.. తండ్రి ఆత్మహత్య

గోపాల్‌పేట: కుమారుడి మరణాన్ని తట్టుకోలేక ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుద్దారంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఏషమోని అంజనేయులు భార్యతో గొడవలు, ఇంటి సమస్యలు తట్టుకోలేక మూడు రోజుల కిందట ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురై తండ్రి కోదండరాములు (55) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని మృతిచెందాడు. కోదండరాములు చిన్న కుమారుడు కూడా ఏడాది కిందట అనారోగ్యంతో మరణించాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేశ్‌కుమార్ వివరించారు.

దీపంతో ప్రమాదం.. తప్పిన ముప్పు



గండేడ్: దేవుడి దగ్గర పెట్టిన దీపంతో ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకుంది. స్థానికులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మన్సూర్‌పల్లికి చెందిన కొత్తపల్లి మాసమ్మ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటుండగా, ఆమె ఒక్కతే గ్రామంలో నివసిస్తోంది. ఆదివారం ఉగాది సందర్భంగా ఇల్లంతా శుద్ధిచేసి దేవుడి పూజ అనంతరం దీపం వెలిగించింది. నైవేద్యం సమర్పించేందుకు మోదుగాకుల కోసం ఊరి చివరకు వెళ్లగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దట్టమైన పొగ, మంటలు రావడం గుర్తించిన స్థానికులు వెంటనే ఇంటి తాళం విరగ్గొట్టి వంటగ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చి నీటితో మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో దుస్తులు, దుప్పట్లు, వంటసామగ్రి అగ్నికి ఆహుతవగా.. ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. సిలిండర్‌ను సకాలంలో బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు మాసమ్మ కోరారు.

చెక్‌డ్యాంలో పడి యువకుడు మృతి

పాన్‌గల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చింటకుంట గ్రామానికి చెందిన యాటగిరి లాలు(24) రాయినిపల్లి గ్రామ శివారులోని చెక్‌డ్యాంలో చేపలు పట్టేందుకు దేశమోని వెంకటేష్‌తో కలిసి వెళ్లాడు. అయితే చెక్‌డ్యాంలో చేపల కోసం వల వేస్తుండగా యాటగిరి లాలు ప్రమాదవశాత్తు కాలు జారీ నీటి గుంతలో పడగా.. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న వెంకటేష్ నీట మునిగిన యాటగిరి లాలును బయటకు తీసి.. ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై లాలు తండ్రి భగవంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రాచమార్గంపై చిన్నచూపు



మిడ్జిల్-హైదరాబాద్ రహదారి

అభివృద్ధిని మరిచిన అధికారులు

- అధ్వానంగా నాగర్‌కర్నూల్-మిడ్జిల్-హైదరాబాద్ రోడ్డు
- మూడు జిల్లాలు, పది మండలాలు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో అనుసంధానం
- అనేక మలుపులతో ప్రమాదభరితం
- అభివృద్ధి చేస్తే హైవేలపై తగ్గనున్న ట్రాఫిక్

జడ్చర్ల: ఈ రోడ్డు అభివృద్ధికి కేరాఫ్‌గా చెప్పుకోవచ్చు. దీన్ని అభివృద్ధి చేస్తే ఎన్నో గ్రామాల ప్రజలకు, వ్యాపారులకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లేందుకు రాచమార్గం అవుతోంది. ముచ్చటగా మూడు జిల్లాలు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పది మండలాలు, అనేక గ్రామాలను అనుబంధ నివాస ప్రాంతాలను అనుసంధానం చేస్తూ ముందుకు సాగుతోంది. నాగర్‌కర్నూలు- మిడ్జిల్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై పాలకులు, అధికారులు దృష్టి సారించి అభివృద్ధికి కృషిచేస్తే అనేక ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేసిన సామాజిక నాయకులు (ఫైల్)

డబుల్ రోడ్డుగా విస్తరిస్తే..

సింగిల్‌రోడ్డుగా ఉన్న ఇంత ప్రధానమైన రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరిస్తే రాకపోకలకు అంతరాయం తొలగనుంది. మిడ్జిల్ నుండి పెద్ద గోల్కొండ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ఈ రహదారి అనేక మలుపులతో మృత్యుకుహారంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. రోజురోజుకు అధికమవుతున్న వాహనాల రాకపోకలకు అనుగుణంగా రోడ్డుని విస్తరించక పోవడం,అక్కడక్కడ చేపట్టిన పనులు ఏళ్ల తరబడి పూర్తిగాక పోవడంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రంగారెడ్డి జిల్లా పెద్ద గోల్కొండ నుండి మిడ్జిల్ మీదుగా నాగర్‌కర్నూల్ వరకు గల దాదాపు 105 కిమీల పొడవున గల ఈరోడ్డును విస్తరించి అభివృద్ధి పరిస్తే ప్రమాదాల నివారణతో పాటు వ్యాపారపరంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వినతులు సమర్పించాం



నాగర్‌కర్నూల్-మిడ్జిల్-హైదరాబాద్ ప్రధాన రహదారికి సంబంధించి పలు సార్లు ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించాం. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు స్థానిక ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులకు వినతి పత్రాలు అందజేశాం. ఈరోడ్డును అన్నివిధాలా అభివృద్ధి పరిస్తే ఎన్నో గ్రామాల ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

– ఎం.క్రాంతిరెడ్డి, సామాజిక వేత్త, షాద్‌నగర్

అన్నివిధాలుగా సౌకర్యం



మిడ్జిల్ నుంచి హైదరాబాద్, నాగర్‌కర్నూల్ ప్రాంతాలకు వెళ్లాలంటే చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. నాగర్‌కర్నూల్-మిడ్జిల్-హైదరాబాద్ రోడ్డును అభివృద్ధి పరిస్తే అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. హైదరాబాద్‌కు నేరుగా రాకపోకలు సాగించే పరిస్థితి ఉంది.

– ఎండీ జహీర్, వ్యాపారి, మిడ్జిల్

మూడు జాతీయరహదారులతో ముడి

మిడ్జిల్-హైదరాబాద్ ప్రధాన రహదారి మూడు జిల్లాలతో పాటు మూడు జాతీయ రహదారులతో అనుసంధానంగా ఉంది. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు హైదరాబాద్-బెంగుళూరు(ఎన్‌హెచ్-44)రహదారితో పాటుగా హైదరాబాద్-శ్రీశైలం(ఎన్‌హెచ్-765), జడ్చర్ల-కల్వకుర్తి (ఎన్‌హెచ్-167) రహదారికి అనుసంధానంగా ఉంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మొదలయ్యే ఈమార్గం పెద్ద గోల్కొండ, నాగారం, మన్సాన్‌పల్లి చౌరస్తా, దుబ్బచర్ల, కోళ్ల పడకల్, సిద్దపురం, బైర్‌ఖాన్‌పల్లి, మంగలిగూడ, కొత్తపేట్, కేశంపేట, కాకునూర్, తొమ్మిదిరేకుల, లింగందన, జూలపల్లి, వెల్జాల్, మిడ్జిల్, మాదారం, సిర్సవాడల మీదుగా నాగర్‌కర్నూల్ వరకు చేరుకునే విధంగా ఉంది. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పది మండలాలు అనేక గ్రామాలతో అనుసంధానం అయిన ఈరోడ్డును అభివృద్ధి చేస్తే దూర భారం తగ్గుతుంది. అటు బెంగుళూర్ హైవే, ఇటు శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ తగ్గే పరిస్థితి ఉంది.

కొనసాగుతున్న సహాయక చర్యలు



సొరంగంలోకి వెళ్తున్న సహాయక సిబ్బంది

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి జాడ కోసం అన్వేషణ
- 37 రోజులుగా నిరంతరాయంగా శ్రమిస్తున్న రెస్క్యూ సిబ్బంది

అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఆదివారం ఉగాది పండుగ రోజు కూడా సహాయక సిబ్బంది కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. సొరంగంలో మట్టి, బురద తొలగింపు పనులు చేపట్టారు. సొరంగంలో ప్రమాదానికి గురైన కార్మికుల జాడ తెలుసుకునేందుకు 37 రోజులుగా నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. 13.940 కి.మీ. వరకు తవ్విన సొరంగంలో 13.500 కి.మీ. వరకు లోకో ట్రైన్ వెళ్లగలుగుతోంది. అక్కడి నుంచి సుమారుగా 250 మీటర్ల వరకు పేరుకుపోయిన మట్టి, పెద్ద పెద్ద బండరాళ్లు, టీబీఎం భాగాలను నాలుగు ఎస్కవేటర్లతో తొలగిస్తున్నారు. సొరంగం లోపల మట్టిలో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి ప్రభుత్వం ఏఒక్క అవకాశాన్ని వదలుకోకుండా నిష్ణాతులైన సిబ్బందిని, సాంకేతికతను ఉపయోగించుకుటోంది. మొదటి రోజు నుంచి సొరంగం లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయడం కోసం ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్‌ఐ, ఎన్‌జీఆర్‌ఐ, ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ కాడవర్ డాగ్స్, రోబోటిక్స్ సహా అన్ని రకాల బృందాలు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని ఆహర్నిశలు కృషి చేస్తున్నారు. సొరంగంలో వస్తున్న నీటి ఊటను నిర్విరామంగా డీ-వాటరింగ్ చేస్తున్నారు. మట్టి, బురద, బండరాళ్లతో పాటు అడ్డుగా ఉన్న టీబీఎం భాగాలను సహాయక సిబ్బంది తొలగించి కన్వేయర్ బెల్టు, లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు.

ఉత్సాహంగా పనిచేస్తున్నారు..

సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది ఉత్సాహంగా పనిచేస్తున్నారని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. ఆదివారం జేపీ కంపెనీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఎన్డీఆర్‌ఎఫ్ కమాండెంట్ కిరణ్‌కుమార్, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, దక్షిణమధ్య రైల్వే అధికారి నేటి చంద్రం, హైడ్రా, జేపీ కంపెనీ ప్రతినిధులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టిలో కూరుకుపోయిన ఆరుగురిని గుర్తించేందుకు రెస్క్యూ సిబ్బంది శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. ఉగాది పండుగ రోజు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బందిని ఆయన అభినందించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్

గ్రూప్-1లో అత్యుత్తమ ప్రతిభ

రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంక్ సాధించిన వడ్డెవాట పవన్‌కుమార్



మండ్ల పవన్‌కుమార్

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పవన్‌కుమార్ గ్రూప్-1 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటారు. గ్రూప్-1లో 510 మార్కులు సాధించి.. ఆదివారం ప్రకటించిన ర్యాంకుల్లో రాష్ట్ర స్థాయిలో 25వ, మల్టీ జోన్‌స్థాయిలో 10వ, బీసీ-ఏ గ్రూప్‌లో 2వ ర్యాంక్ సాధించారు. తాను అడిషనల్ కలెక్టర్‌గా ఎంపిక కాబోతున్నట్టు మండ్ల పవన్‌కుమార్ తెలిపారు. తనను ఇంతటి స్థాయికి తీసుకువచ్చిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. పవన్‌కుమార్ తల్లి గృహిణి కాగా.. తండ్రి వెంకటస్వామి హెడ్‌కానిస్టేబుల్‌గా స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

నిజాలాపూర్ యువకుడికి 27వ ర్యాంక్



తల్లిదండ్రులతో వెంకటేష్ ప్రసాద్ సాగర్

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన మునుగల్‌చేడ్ సత్యయ్య, యశోద దంపతుల కుమారుడు ఎం.వెంకటేష్ ప్రసాద్ సాగర్ గ్రూప్-1 ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించారు. మల్టీ జోన్-2లో 12వ ర్యాంకు వచ్చింది. అతడు హైదరాబాద్‌లోని పటాన్‌చెరువు శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో 1, 2వ తరగతులు, కొత్తకోటలోని జీటీ నారాయణ స్కూల్‌లో 3వ తరగతి, మహబూబ్‌నగర్‌లోని చైతన్య సెంట్రల్ స్కూల్‌లో 4 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. తర్వాత అనంపురం జిల్లా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి విద్యాసంస్థల్లో ఇంటర్ (ఎంపీసీ), డిగ్రీ (బీఎస్సీ ఫిజిక్స్), పీజీ పూర్తిచేశారు. రెండేళ్ల నుంచి గ్రూప్-1కు ప్రిపేర్ అయ్యారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించారు. పోటీ పరీక్షలకు ప్రిపేరైన మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వెంకటేష్ ప్రసాద్ సాగర్ తండ్రి సత్యయ్య ప్రస్తుతం కోయిలకొండ మండలంలో విద్యుత్‌శాఖ ఏఈగా పనిచేస్తుండగా.. తల్లి యశోద గృహిణి. పదేళ్లుగా సత్యయ్య కుటుంబంతో కలిసి మహబూబ్‌నగర్‌లోని శేషాద్రినగర్‌లో నివాసముంటున్నారు.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం

గ్రూప్-1 ర్యాంకర్ డా.సాహితి



కల్వకుర్తి రూరల్: జీవితంలో ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు గ్రూప్-1 ర్యాంకర్ డా. మొహరీల్ సాహితి చెప్పారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటరమణ, రాజ్యలత కూతురు సాహితి గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో 119వ ర్యాంకు, మల్టీ జోన్-2లో 45వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మూడేళ్ల క్రితం ఎంబీబీఎస్ పూర్తిచేసినట్లు చెప్పారు. తాను వైద్య విద్య అభ్యసించినప్పటికీ కరోనా సమయంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను స్వయంగా చూశానని.. కలెక్టర్ స్థాయిలో ఉంటే ప్రజల సమస్యలు పరిష్కరించగలమనే నమ్మకం కలిగిందన్నారు. అప్పటి నుంచి ఐఏఎస్ లక్ష్యంగా చదివానని చెప్పారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా గ్రూప్-1లో మంచి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తనకు వచ్చిన ర్యాంకు ప్రకారం డీఎస్పీ అవకాశం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సత్తాచాటిన మహిళా ఎస్‌ఐ..



సుజాత

పాలమూరు: గ్రూప్-1 ఫలితాల్లో మహిళా ఎస్‌ఐ సత్తాచాటారు. భరోసా కేంద్రం ఎస్‌ఐగా పనిచేస్తున్న సుజాత గ్రూప్-1 ఉద్యోగం సాధించింది. వనపర్తి జిల్లాకు చెందిన సుజాత 2018లో మొదట కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా రెండేళ్లు పనిచేసిన తర్వాత 2020లో సివిల్ ఎస్‌ఐగా ఎంపిక అయ్యారు. ఎస్‌ఐ శిక్షణ పూర్తి చేసిన తర్వాత టూటౌన్ పోలీస్ స్టేషన్‌తోపాటు మూసాపేట్ పోలీస్‌స్టేషన్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. భరోసా కేంద్రం ఎస్‌ఐగా పనిచేస్తున్నారు.

ఆకట్టుకున్న సందెపురాళ్ల పోటీలు



సందెపురాయిని ఎత్తిన యువకుడు

మల్దకల్: ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో సందెపురాళ్ల పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఔత్సాహికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన నరేష్ 100 కిలోల బరువు ఎత్తి విజేతగా నిలువగా.. బుచ్చన్న 85 కిలోల బరువు ఎత్తి ద్వితీయ, పరశురాం 80 కిలోల బరువు ఎత్తి తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చట్నీలో బల్లి

- నలుగురికి అస్వస్థత
- హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యం
- అరెస్ట్ చేసిన పోలీసులు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం: హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా చట్నీలో బల్లి పడి మృతిచెందింది. వాటిని తిని నలుగురు అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. కృష్ణారోడ్డు మార్గంలోని అహ్మద్ టిఫిన్ సెంటర్‌లో రెవెన్యూ కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి, రఘు, వెంకటేష్, వర్మ ఉదయం ఇడ్లీ, వడ, ఉగ్గానీలను పార్సిల్ తీసుకెళ్లారు. ఇంటికి వెళ్లి టిఫిన్ చేస్తున్న క్రమంలో చెట్నీని రుచి చూశారు. చట్నీలో మృతి చెందిన బల్లిని గుర్తించి ఆందోళన చెందారు. చికిత్స నిమిత్తం వెంటనే జిల్లా ప్రభుత్వాస్పత్రికి పరుగులు తీశారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. కలుషితమైన ఆహారం తినడంతోనే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు చెప్పారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షణాల్లో హోటల్‌ను మూసివేయించారు. నిర్వాహకులు తయారుచేసిన పలు పదార్థాలను శాంపిల్స్‌గా తీసుకొని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారులకు పరీక్షల నిమిత్తం అందజేయనున్నారు. హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యంపై పోలీసులు తీవ్రంగా మండిపడ్డారు. ఎంత మంది ఈ చట్నీ తిని అస్వస్థతకు గురయ్యారో ఆరా తీశారు. హోటల్ యజమానిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అస్వస్థతకు గురైన బాధితుల పరిస్థితిపై 'సాక్షి' వైద్యులను సంప్రదించగా ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఘటనపై శ్రీనివాస్‌రెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్ కేసు నమోదు చేశారు.

పొరపాటు జరిగింది..

చాలా ఏళ్లుగా టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాం. ఎప్పుడు ఇలాంటి సంఘటనలు జరగలేదు. కార్మికులు గుర్తించకపోవడంతో తప్పిదం జరిగింది. బాధితులకు అన్నివిధాలా సాయం అందిస్తాం. పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరిస్తాం. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా అప్రమత్తంగా ఉంటాం.

– అహ్మద్, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

ఎరువుల వినియోగంలో పొదుపు అవసరం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

అలంపూర్: ఎరువుల ధరలు అధికంగా ఉండటంతో అన్నదాతలు వాటి కొనుగోళ్లకు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. కాబట్టి పొదుపుగా వినియోగించుకొని పెట్టుబడి ఆదా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు.

పొదుపు ఎలా సాధ్యం?

అవసరమైన మేర ఎరువులను పంటకు అందించడం.. మొక్క సమర్థవంతంగా తీసుకొనేటట్లు చేయడంతో ఖర్చు తగ్గించుకొనే అవకాశం ఉంటుంది. ఎరువులు ఎంత వేయాలి.. ఏ విధంగా వేయాలి.. ఏవి ఎంపిక చేసుకోవాలి.. ఏ సమయంలో ఎన్ని సార్లు విభజించి వేయాలనే అంశాలపై అవగాహన పెంచుకుంటే పొదుపుగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

ఎరువులు ఎంత వేయాలి?

నేలలో మొక్కకు కావాల్సిన పోషకాలు కొద్దో గొప్పో ఉంటాయి. నేల లక్షణాలు బట్టి పోషకాల లభ్యతలో తేడాలుంటాయి. వేసే పైరును బట్టి నేలలోని పోషకాల ఆధారంగా ఏ పోషకం ఎంత వరకు వేయాలని నిర్ధారించుకోవాలి. ఇది భూసార పరీక్షలతోనే సాధ్యపడుతుంది.

ఎరువులు వేసే పద్ధతి..

వెదజల్లే విధానం(బ్రాడ్‌కాస్టింగ్): మొక్కలు పొలం నిండా దగ్గర దగ్గరగా ఉండి వరుసల్లో లేని పైర్లకు, వేళ్ల భూమిలో అల్లుకొని ఉండే పైర్లకు ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది. నీరు నిలిచిన పొలంలోగాని పొడి నేల మీదగాని ఎరువులు చల్లితే వృథా అవుతాయి. ఏ ఎరువులు పొలానికి వేసినా నేలలో కలిసేటట్లు వేయాలి.



మొక్క మొదళ్లలో ఎరువు వేస్తున్న రైతులు(ఫైల్)

గొర్రుతో వేయడం: మెరుగుపర్చబడిన ఈనాటి గొర్రు (సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్) సాయంతో విత్తనం, ఎరువు కావాల్సినంత దూరంలో, కావాల్సిన లోతులో పడేటట్లు వేయవచ్చు. ఎరువు వేసే సమయాల్లో విత్తనానికి తగలకుండా జాగ్రత్త పడాలి.

గుంటల్లో వేయడం: మొక్క మొదళ్ల వద్ద తేమగా ఉన్నప్పుడు 6లేదా 7 సెం.మీల లోతులో చిన్న గుంత తీసి ఎరువు వేసి మట్టితో కప్పి ఉంచాలి. దీంతో వేళ్లకు దగ్గరగా పోషకాలు అందుబాటులో ఉండి శక్తివంతంగా ఉపయోగపడతాయి.

పండ్లతోటలకు: మొక్క మొదలు నుంచి వయసు బట్టి 1 లేదా 1/2 దూరం వదిలి వేయాలి. నేలలో తగినంత తేమ ఉన్న సమయాల్లో పాదంత ఎరువులు చల్లి పారతో పలుచగా తిరగవేయాలి. ఇది మేలైన పద్ధతి. పెద్ద చెట్లకు నాలుగు వైపుల నాలుగు చిన్న గుంతలు (30 సెం.మీ వెడల్పు, 15 సెం.మీ లోతు)తీసి అందులో సమానంగా ఎరువు వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి.

పైరుపై పిచికారీ: సాధారణంగా అన్ని పైర్లపైనా.. ఫల వృక్షాల మీద 2 నుంచి 3 శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయవచ్చు. ఇటీవల ప్రాచుర్యంలోకి వచ్చిన స్ప్రింక్లర్లు, డ్రిప్ పద్ధతుల్లో సాగునీటితో పాటు ద్రవ ఎరువులను కలిపి అందించడంతో ఖర్చు తగ్గుతుంది.

ఎరువుల ఎంపిక..

ఎరువుల లక్షణాలు వేర్వేరుగా ఉంటాయి. ఇసుక ఎక్కువగా ఉన్న మాగాణి భూముల్లో తప్ప మిగతా అన్ని నేలలు, పంటలకు పైరు అడుగులో యూరియా వేసుకోవచ్చు. అమ్మోనియం సల్ఫేట్ క్షార గుణం నేలలకు, సున్నపు పాలు ఎక్కువగా ఉన్న నేలలకు ఎప్పుడైనా వేసుకోవచ్చు.

☛ సూపర్ ఫాస్ఫేట్‌ను సాధారణంగా అన్ని పైర్లకు సామాన్యస్థిగల నేలలు, క్షార నేలలకు వేయవచ్చు. ఆమ్లగుణం గల నేలలు సల్ఫెడ్ ఇంజూరీ వచ్చే నేలలకు వేయెుద్దు. ఆమ్ల గుణం నేలలకు డైకాల్షియం ఫాస్ఫేట్, రాక్ ఫాస్ఫేట్ వంటివి పనికి వస్తాయి. అయితే ఇవి క్షార గుణం గల నేలలు, సాధారణ పైర్లకు ఉపయోగపడవు. ఫల, తోట వృక్షాల వంటి బహువార్షికాలకు వాడవచ్చును.

☛ మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పాలచౌడు నేలలకు తప్ప మిగిలిన అన్నీ నేలలకు వాడవచ్చు. పొగాకు పైరుకు వేయరాదు. నాణ్యత తగ్గిపోతుంది. సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌ను అన్ని నేలలు, అన్ని పైర్లకు వాడవచ్చు. కాంప్లెక్స్‌ల్లో ఎరువుల్లో అమ్మోనియం ఫాస్ఫేట్ అన్ని నేలలకు అన్ని పైర్లకు వేయవచ్చు. నైట్రో ఫాస్ఫేట్ మెట్ట, ఆరుతడి తోట పైర్లకు, ఎర్ర నేలలకు, సామాన్య రసాయన స్థితిగల నేలలు, కొద్దిపాటి ఆమ్లగుణం గల నేలలకు బాగా ఉపయోగపడుతాయి.

చిన్న పలుగు గుట్టపై మంటలు



అడవిలో చెలరేగిన మంటలు

ఊర్కొండ: మండలంలోని ఇప్పపాడు గ్రామ శివారు చిన్న పలుగు గుట్టపై మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో చిన్న పలుగు గుట్టపై అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయని రైతులు తెలిపారు. తోటి రైతులు ఒకరికి ఒకరు ఫోన్లు చేసుకొని సంఘటనా స్థలానికి చేరుకునే సరికి పూర్తిగా మంటలు వ్యాపించడంతో మంటలను అదుపు చేయలేకపోయారు. అయితే రైతుల పొలాలకు మాత్రం మంటలు వ్యాపించకుండా చూసుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు పొలంలో పైపులు దగ్ధమయ్యాయి. అలాగే అడవిలో 20 ఎకరాల మేర పశుగ్రాసం దగ్ధమైందని రైతులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. వివరాలు.. గద్వాల మండలంలోని గుంటిపల్లికి చెందిన కుర్వ రాజన్న(60)ను శనివారం రాత్రి కొండేరు సమీపంలో బైక్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం ఆదివారం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి కుమారుడు కుర్వ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.